

మిడ్ మానేరు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి: విప్ 5
గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్పీ 6

స్వచ్ఛత వైపు విద్యార్థులు

- నేటి నుంచి స్వచ్ఛ పక్వాడా కార్యక్రమాలు
- జిల్లాలోని పాఠశాలల్లో ఏర్పాట్లు
- విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన
- జిల్లాలో 510 పాఠశాలలు... 40,369 మంది విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సీజనల్ వ్యాధులు పెద్ద వాళ్లనే కాదు చిన్నవాళ్లను ఇబ్బంది పెడుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎవరిని కదిలించినా జ్వరాలతో బాధపడుతున్న తీరును చెప్పుకుంటూ అవేదన వ్యక్తం చేస్తున్నారు. వైరల్ జ్వరాలతో పాటు డెంగ్యూ, చికున్ గున్యా ఇబ్బంది పెడుతున్న క్రమంలో వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశు భ్రతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు అవగాహన కల్పించ నున్నారు. స్వచ్ఛ పక్వాడా పేరుతో విద్యార్థుల్లోనూ స్వచ్ఛతపై అవ గాహన పెంపొందిస్తూ 15 రోజుల పాటు రోజుకో కార్యక్రమాన్ని ముందుకు తీసుకువ చ్చారు. విద్యార్థుల్లో ఆరోగ్య పరిశుభ్రతను పెంపొందించే దిశగా సెప్టెంబరు 1 నుంచి 15వ తేది వరకు స్వచ్ఛత పక్షోత్సవాలను అన్ని పాఠశాలల్లోనూ నిర్వహించడానికి ప్రభుత్వం షెడ్యూలు విడుదల చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 510 పాఠశాలలు ఉండగా 40,369 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో బాలురు 19,531, బాలికలు 20,838 మంది ఉన్నారు. ప్రాథమిక పాఠశా లలు 338 ఉండగా 15,472 మంది విద్యార్థులు, ప్రాథమికోన్నత పాఠశాలలు 38 ఉండగా 2,410 మంది విద్యార్థులు ఉన్నారు. ఉన్నత పాఠశాలలు 114 ఉండగా 15,763 మంది విద్యార్థులు, అర్బన్ రెసిడెన్షియల్ ఒకటి ఉండగా 105 మంది విద్యార్థులు, కస్తూర్బా గాంధీ విద్యాలయాలు 13 ఉండగా 1790 మంది విద్యార్థినులు చదువు తున్నారు. ఏడు తెలంగాణ మో డల్ స్కూల్స్‌లో 4,059 మంది విద్యార్థులు, టీఆర్ ఈఐఎస్ పాఠశా లల్లో 770 మంది విద్యార్థులు ఉన్నారు. జిల్లాలో 283 పాఠశాలలు అమ్మ అదర్శ పాఠశాలలుగా కనీస సౌకర్యాలను గుర్తించి తాగునీరు, మూత్రశాలలు, మైనర్ రిపేర్లు, కరెంట్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తు న్నారు. ఈక్రమం లోనే స్వచ్ఛ పక్వాడాలో విద్యార్థులకు పరిస రాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు మొక్కలు నాటడం, ఇతర కార్యక్రమాల్లో పోటీలను కూడా నిర్వహించి బహుమతులను కూడా అందజేయ నున్నారు.

Celebrating Swachhata Pakhwada 1st to 15th September



చేతులు కడుక్కుంటున్న విద్యార్థినులు (ఫైల్)

- స్వచ్ఛ పక్షోత్సావాలు ఇలా...

జిల్లాలో 510 పాఠశాలల్లో స్వచ్ఛ పక్షోత్సవాలను వివిధ అంశాల వారీగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

- సెప్టెంబరు 1న ఉపాధ్యాయులు విద్యార్థులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయిస్తారు.
- 2, 3 తేదీల్లో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తారు.
- 4, 5 తేదిల్లో విద్యార్థులు సమాజానికి చేరువ చేసే దిశగా స్థానిక ప్రజలు, విద్యావేత్తలతో విద్యార్థులను మమేకం చేయడం, స్వచ్ఛతపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతారు.
- 6న హరిత దినోత్సవాన్ని నిర్వహిస్తారు. పాఠశాలల్లో విద్యార్థులతో మొక్కలు నాటించి, వాటిని సంరక్షించడంపై అవగాహన కల్పిస్తారు.



- 7, 8 తేదీల్లో స్వచ్ఛతలో భాగంగా సీనియర్, జూనియర్, కేటగిరీల్లో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, క్విజ్ పోటీలను నిర్వహిస్తారు.
- 9, 10 తేదీల్లో విద్యార్థులు పరిశుభ్రత ప్రాధాన్యాలను వివరించడం, మధ్యాహ్న భోజన సమయంలో చేతులు సరిగ్గా కడుక్కోవడం, చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి వాటిపై వివరిస్తారు.
- 11వ తేదీన వ్యక్తిగత పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహిస్తారు. వ్యక్తిగతంగా ఎలా ఉండాలనే దానిపై అవగాహన కల్పిస్తారు.
- 12వ తేదీన స్వచ్ఛతపై పాఠశాలల్లో ఎగ్జిబిషన్‌ను నిర్వహించడం, సమాజంలో విద్యార్థులను భాగస్వామ్యం చేయడంపై అవగాహన కల్పిస్తారు.
- 13, 14 తేదీల్లో స్వచ్ఛతపై ప్రణాళిక కార్యచరణ విధానాన్ని విద్యార్థులతో సిద్ధం చేయించి స్వచ్ఛ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తారు.
- చివరి రోజు 15వ తేదిన పక్షోత్సవాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తారు.

విద్యార్థులకు కావాల్సిన వసతులు కల్పించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 31: ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లలో విద్యార్థులకు కావాల్సిన వసతులు కల్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లాలోని వసతి గృహ భవనాల యజమానులు, విద్యాలయాల ప్రిన్సిపాల్స్‌తో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వసతి గృహాల్లో ఎంతమంది విద్యార్థులు ఉంటున్నారు? ఎన్ని గదులు ఉన్నాయి? టాయిలెట్స్, కిచెన్ ఇతర సదుపాయాలపై సంబంధిత విద్యాలయాల ప్రిన్సిపాల్స్‌ను ఆరా తీశారు. శానిటేషన్, మెనూపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి, వసతి గదులు, టాయిలెట్స్, మెస్ హాల్ ఉండాలన్నారు. ఈ మేరకు పక్కా ప్రణాళికతో భవనాల యజమానులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. వసతి గదుల కిటికీలు, డోర్లకు దోమతెరలు, ఎగ్జిస్ట్ ఫ్యాన్లు సమకూర్చాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లలో పంచాయతీరాజ్, రోడ్స్ అండ్ బిల్డింగ్ అధికారులతో సర్వే నిర్వహించాలని, ఏఏ వసతులు కావాలో నివేదిక ఇవ్వాలని సూచించారు. విద్యార్థులకు స్వచ్ఛత, పరిశుభ్రతపై తప్పకుండా అవగాహన కల్పించాలని వివరించారు. ప్రతీ 15 రోజులకు ఒకసారి విద్యాల యాల్లో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించేలా చూసుకోవాలన్నారు. ఐరన్ లోపం ఉన్న పిల్లలకు మందులు, పండ్లు ఇవ్వాలని ఆదేశించారు. ఆహార పదార్థాలు తయారు చేసే సిబ్బందికి తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించాలని, నిల్వ ఉన్న ఆహారం ఇవ్వకూడదని ప్రిన్సిపాల్స్‌కు కలెక్టర్ సూచించారు. సమావేశం లో డీఈవో రమేష్ కుమార్, జోనల్ ఆఫీసర్ ప్రత్యూష, సాంఘిక సంక్షేమ గురుకులాల కో ఆర్డినేటర్ థెరిసా, ఆయా విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, భవనాల యజమానులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు చర్యలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాధవి

వేములవాడ, ఆగస్టు 31: సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు పురపాలక సంఘం తరఫున తగిన చర్యలు చేపడుతు న్నామని వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి తెలిపారు. వేములవాడ పురపాలక సంఘం పాలకవర్గం సమావేశం శనివారం నాడు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిం చారు. చైర్‌పర్సన్ మాధవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 42 ఎజెండా అంశాలతో పాటు ఆరు టేబుల్ అంశాలపై చర్చించి ఆమోదం పొందారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గణేష్ నిమజ్జనం కార్యక్రమానికి పురపాలక సంఘం తరఫున గుడి చెరువు కట్టపై తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించామని చైర్‌పర్సన్ మాధవి తెలిపారు. వాతావరణ పరిస్థితులు మారుతున్నందున డెంగ్యూ, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో అన్ని వార్డుల్లో ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రే చేయాలని నిర్ణయిం చామన్నారు. రోడ్ల పక్కన ఉండే చెత్తాచెదారాన్ని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తామని, మురికి కాల్వలలో ఎప్పటికప్పుడు చెత్త తొలగించి పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించామన్నారు. పారిశుధ్య నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్‌తో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించామని తెలిపారు. మున్సిపల్ పరిధిలో చేపట్టా ల్సిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి కౌన్సిల్ సభ్యుల ఆమోదంతో చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేష్, ఇన్‌చార్జి కమిషనర్ సంపత్ రెడ్డి, డీఈ తిరుపతి, ఏఈ నర్మద, టీపీవో అన్సారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా సంపత్‌రెడ్డి

వేములవాడ, ఆగస్టు 31: వేములవాడ పురపాలక సంఘం ఇన్‌చార్జి కమిష నర్‌గా సంపత్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్యాల యంలో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సంపత్‌రెడ్డికి తాత్కాలికంగా ఇన్‌చా ర్జి కమిషనర్ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్క డ కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన అన్వేష్ వ్యక్తిగత కారణాలపై రెండు నెలల సెలవుపై వెళ్లగా మేనేజర్ సంపత్‌రెడ్డిని ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించా రు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

సర్వేలు త్వరగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పనులకు సంబంధించిన సర్వేలు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ సర్వేయర్లతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ స్థానికంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వానికి చెందిన సర్వే పనులు వేగంగా పూర్తి చేయాలని పెండింగ్‌లో పెట్టవద్దని అదేశించారు. రైతులు, ఇతర వ్యక్తుల దరఖాస్తులను పరిష్కరించాలని ఇంచార్జ్ బాధ్యతలు ఉన్నావారు జిల్లాలో మూడు రోజులు విదులు నిర్వర్తించాలని వివరించారు. సర్వేయర్ల పనితీరుపై నివేదికలు ఇవ్వాలని అదేశించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎడీ విన య్‌కుమార్, డీఐలు బాలచందర్, రత్నం పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం సమావేశం

ఇల్లంతకుంట, ఆగస్టు 31: మండలంలోని దాచారం గ్రా మంలోని రైతువేదికలో రుణమాఫీ కోసం శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి మాట్లాడుతు రైతు రుణ మాఫీ కానివారి కుటుంబ నిర్ధారణ చేశామన్నారు. రైతులు మండలంలో 591మంది ఉండగా 189మంది రైతుల ఫ్యామిలీ గ్రూపిం గ్ చేశామని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం అన్ని గ్రామా లకు వ్యవసాయశాఖ అధికాలు వస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ అర్చన రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రమదానం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 31: మండల కేంద్రంలోని ప్రభు త్వ జూనియర్ కళాశాల ఆవరణలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలోని విద్యార్థులు శనివారం శ్రమదానం చేశారు. కళాశాల ఆవరణలోని పిచ్చిమొక్కలు, చెత్తాచెదా రాన్ని తొలగించారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. కా ర్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాప కులు పాల్గొన్నారు.

రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్/వేములవాడ రూరల్, ఆగస్టు 31: రైతులు ఎలాంటి ఆందో ళన చెందాల్సిన పనిలేదని లేదని అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేసి తీరు తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ అర్బన్ మండలం మారుపాకలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు ఏనుగు తిరుపతిరెడ్డితో కలిసి గోదాం నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వ హించారు. వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి, మల్లారం గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎరువుల గోదాంలకు భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడారు. రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం అండగా ఉంటుంద న్నారు. ఆధార్ కార్డుల్లోని తప్పుల వల్ల, బ్యాంకర్ల వివరాలు తప్పుగా పంపించ డంవల్ల కొన్ని తప్పుల వల్ల రైతుల రుణమాఫీ జరగలేదన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం గ్రీవెన్స్ ఏర్పాటు చేసిందన్నారు. రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరిస్తున్నామన్నారు. అందరికీ రుణమాఫీ అందేలా చూస్తామని తెలిపారు. కా ర్యక్రమంలో వేములవాడ అర్బన్, రూరల్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు పిల్లి కనుకయ్య, శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



మల్లారంలో గోదాం నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న ఆది శ్రీనివాస్

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

వీర్నపల్లి, ఆగస్టు 31: ప్రభుత్వ హాస్టల్లో ఉండి చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఎస్సై ఎల్లాగౌడ్ అన్నారు. వీర్నపల్లి మండలం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు పోక్సో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు లైంగికంగా వేధింపులకు గురైతే పోలీసులకు గాని ఉపాధ్యాయులకు గాని సమా చారం అందించాలన్నారు. అనంతరం హాస్టల్ వి ద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యత ను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విశ్వనాథం, హెడ్ కానిస్టేబుల్ బాబు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్ఐ

ఫ్రెషర్స్‌డే వేడుకలు

తంగళ్లపల్లి, ఆగస్టు 31: మండలంలోని మండెపల్లి మో డల్ స్కూల్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం నిర్వహిం చారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ. 101కే అంత్యక్రియలు

- పేద వర్గాలకు ఊరటనిస్తూ బల్దియా నిర్ణయం - సిరిసిల్ల మున్సిపల్ సాధారణ సమావేశం





మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జిందం కళ, హాజరైన కౌన్సిలర్లు

సిరిసిల్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే దహన సంస్కా రాలు నిర్వహించడానికి అనేక ఇ బ్బందులు పడుతున్న నేపథ్యంలో సిరిసిల్ల మున్సిపల్ పాలక వర్గం విద్యానగర్, నెహ్రూనగర్ వైకుంఠ ధామాల్లో 101 రూపాయ లకే అం త్యక్రియలు నిర్వహించడానికి కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి అధ్యక్షతన సిరిసిల్ల మున్సిపల్ సాధారణ సమావేశం శనివా రం జరిగింది. అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగ పడే విధంగా వైకుంఠధామం లో కట్టెలు, వాటిని పేర్చడానికి ఇతర పనులకు సంబంధించి ఒక నెలకు రూ లక్ష చొప్పున వ్యయం కానున్నదని అంచనా వేశారు. 12 లక్షల రూపాయలను మున్సిపల్ సాధారణ నిధులనుంచి కేటాయించారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వర్గాల ప్రజలు అంత్యక్రియలకు సంబంధించి 101 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. దీని నిర్వహణను మహిళ గ్రూపులకు అప్పగించడానికి తీర్మానం చేశారు. పట్టణంలోని వివిధ సమస్యలు, ఇతర అవసరాలకు సంబంధించి ప్రవేశపెట్టిన 19 అంశాలకు సంబం ధించిన ఎజెండాను ఏకగ్రీవంగా ఆమోదించారు. వినాయక చవితి, బతుకమ్మ ఉత్సవాల సందర్భం గా రూ 43.50 లక్షలతో ఏర్పాట్లు చేయాలని నిర్ణ యించారు. వినాయక చవితి నిమజ్జనం సందర్భం గా మానేరు వాగులో నిమజ్జనం పాండ్, ఏర్పాట్లు, లైటింగ్, భారీ కేడ్లు, హైడ్రాలిక్ క్రేన్లు, పట్టణంలో వివిధ చోట్ల మొరం, స్టోన్ డస్ట్ వేయడానికి 15 లక్షల రూపాయలు కేటాయించారు. బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా మానేరు వాగు వద్ద బతుకమ్మ నిమజ్జనం కోసం రూ 28.50 లక్షలు ఖర్చు అవుతాయని అంచనా వేసి ఏర్పాట్లకు నిర్ణ యాలు చేశారు. బతుకమ్మ నిమజ్జనం చివరి రోజు క్రాకర్ షోకు రూ 1.50 లక్షలు, వివిధ వార్డుల్లో నిమజ్జనం ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాట్లకు ఐదు లక్షలు, బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాట్లకు ఐదు లక్ష లు కేటాయించారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మో త్సవాల్లో భాగంగా రథోత్సవం రోజు వచ్చే భక్తుల కోసం పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి మూడు లక్షలు, ఇందిరాపార్కులో యోగా షెడ్ నిర్మాణానికి మూడు లక్షలు కేటాయించారు. కూరగాయల మార్కెట్, కొత్త బస్టాండ్‌లో దుకాణాల సముదా యం కాలపరిమితి ముగిసినందున పాత కిరాయి దారులకు 33.33 శాతం పెంచి వారికి ఇచ్చే విధంగా నిర్ణయించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో మాస్టర్ ప్లాన్ నిర్వహణ, రెసిడెన్షియల్ జోన్, కమర్షియల్ జోన్‌ల ఏర్పాటుతో పాటు ఇతర పనులు చేపట్టడానికి ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహాత్ బేగ్ అలీ, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



కూలిన ప్రాచీన పాండురంగ దేవాలయం


కరీంనగర్ టౌన్, ఆగస్టు 31: నగరంలోని పాతబజార్ 49వ డివిజన్ పరిధిలోని అతి ప్రాచీన శ్రీపాండురంగ దేవాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో కురుస్తున్న వర్షాలతో స్లాబ్ పైకప్పు, గోడలు కూలి పోయాయి. సమాచారం తెలుసుకున్న డిప్యూటీ మేయర్ చల్లస్వరూప రాణి హరిశంకర్ స్థానిక కార్పొరేటర్ కమల్ జిత్‌కౌర్ సోహెన్‌సింగ్‌తో కలిసి శనివారం ఆలయాన్ని పరిశీలించారు. ఆలయంపై కప్పు, గోడలు కూలినందున భక్తులు, ప్రజలు ఎవరు కూడా ఆలయంలోకి వెళ్ళవద్దని సూచించారు. కూలిపోయిన గోడలు, పైకప్పును తొలగించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా వేదపండితులు బ్రహ్మశ్రీ మంగళంపల్లి వేణుగోపాల శర్మతో, భూ యజమానితో మాట్లాడి ఆలయ పునర్నిర్మాణం చేపట్టే విధంగా కార్యాచరణ రూపొందించి నిర్మాణాన్ని ప్రారంభించాలని డిప్యూటీ మేయర్ సూచించారు.

కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి కేంద్ర మంత్రి భూమి పూజ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 31: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి సంజయ్ కుమార్ నగరంలో కమ్యూనిటీ భవనాలకు నిధులు కేటాయించి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. శనివారం 29వ డివిజన్ కాపువాడలో నిర్మించనున్న కాపువాడ కమ్యూనిటీ భవనానికి రూ.15 లక్షలు, 13వ డివిజన్ పెద్దమ్మ కాలనీలో వడ్డెర కమ్యూనిటీ హాల్‌కు ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గుగ్గిళ్లపు రమేశ్, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీతో కలిసి కమ్యూనిటీ భవనాలకు శంఖుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమాల్లో సంఘాల ప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాపువాడలో శంకుస్థాపన చేస్తున్న బండి సంజయ్‌కుమార్



ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా
దశల వారీగా ఆందోళనలు

సుభాష్‌నగర్, ఆగస్టు 31: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా సెప్టెంబరు 2 నుంచి దశల వారీగా ఆందోళనలు చేపట్టాలని ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జేఎస్‌రావు, సీనియర్ న్యాయవాది కొరివి వేణుగోపాల్, కరీంనగర్ అధ్యక్షుడు బద్దం డానియల్ పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక కార్ఖానగడ్డలో గల అంబేడ్కర్ మెమోరియల్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సెప్టెంబరు 2న తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన, అనంతరం వినతిపత్రాల అందచేత, 11న ఎమ్మెల్యే, ఎంపీ, ఛైర్మన్, కేంద్ర, రాష్ట్ర మంత్రులకు వినతి పత్రాలు ఇస్తామన్నారు. 16న కలెక్టరేట్ ఎదుట నిరసనలు, 27న చలో హైదరాబాద్, అసెంబ్లీ ముట్టడి ఉంటుందని తెలిపారు. అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు వర్గీకరణకు, క్రిమిలేయర్‌కు అనుకూలమా, వ్యతిరేకమా స్పష్టం చేయాలన్నారు. సమావేశంలో వంచిత్ బహుజన్ అఘాడి పార్టీ రాష్ట్ర కార్యదర్శి తీగల శేఖర్, గంగాధర్, దశరథం, ఎడ్ల రామకిషన్, టి ఓంప్రకాశ్, గంభీరావు పేట అంజయ్య, దొంత రాజేశం, కాంపెల్లి రమణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 31: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదేశాలతో ఆలయ పీఆర్వో అశోక్, సూపరింటెండెంట్ తిరుపతిరావులు, ఎడ్ల శివసాయిలు ఏర్పాట్లను పరిశీలించారు.


శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు..

శ్రావణ మాసం పురస్కరించుకుని శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు భీమేశ్వర స్వామి వారి ఆలయంలోని శనీశ్వరుడికి భక్తులు నువ్వుల నూనేతో అభిషేకం నిర్వహించి స్వామి వారికి నల్లబట్టను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ముగ్గురు ఉద్యోగుల పదవీ విరమణ..

రాజన్న ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న సూపరింటెండెంట్ అల్లి శం కర్, ముఖ్య అర్చకులు అప్పాల కరుణాకర్, స్కావెంజర్ జాక్పాల్ శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ ఆవరణలో ఓపెన్ స్లాబ్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించగా, ఆలయ ఉద్యోగుల కార్యదర్శి కూరగాయాల శ్రీనివాస్, ఈఈ రాజేష్, ఏఈవోలు జయకుమారి, శ్రీనివాసు పదవీవిరమణ పొందిన వారిని సత్కరించారు. అప్పాల కరుణాకర్ సుధ దంపతులు నిర్వ హించిన వీడ్కోలు సమావేశానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై సన్మానించారు.









ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	15,689	4,825	80.5	60.823
ఎల్లంపల్లి	14,302	6,580	20.175	18.063
మిడ్ మానేరు	10,450	19,550	27.54	14.98
ఎల్ఎండీ	4.100	253	24.034	12.923

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● నలుగురికి తీవ్ర గాయాలు


తాడూరి రాజమౌళి(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 31: వివాహానికి వెళ్తూ ఓ వ్యక్తి మృతి చెందగా, నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన తాడూరి రాజమౌళి(60) తన సోదరుడి కుమారుడి వివాహం శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలోని మత్స్యగిరీంద్రస్వామి దేవాలయంలో ఏర్పాటు చేశారు. వివాహానికి హాజరయ్యేందుకు శనివారం తెల్లవారుజామున గ్రామం నుంచి తాడూరి గంగయ్య మరి కొందరితో కలిసి ఆటోలో బయల్దేరి వెళ్లారు. ఆటో సింగాపూర్ శివారులోని వెన్నంపల్లి క్రాస్ వద్దకు చేరుకోగానే ఓ గుర్తు తెలియని వాహనం అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో తాడూరి రాజమౌళి తలకు బలమైన గాయం కాగా, ఆటోలో ప్రయాణిస్తున్న తాడూరి హనుమయ్య, తాడూరి ధర్మయ్య, అక్షయ తిరుపతి, తాడూరి గంగయ్య, పల్లె కొమురయ్య, పల్లె హర్షవర్ధన్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తాడూరి రాజమౌళిని ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ విచారం వ్యక్తం చేశారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

● టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, ఆగస్టు 31: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ అన్నారు. శనివారం కరీంనగర్ సర్కిల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేబుల్, బ్రాడ్ బ్యాండ్ ఆపరేటర్లు కేబుల్‌లను విద్యుత్ స్తంభాలపై క్రమ పద్ధతిలో ఉంచాలన్నారు. బ్రేక్ డౌన్ పునరుద్ధరించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూసుకోవాలన్నారు. కేబుల్ వైర్లు అస్తవ్యస్తంగా ఉండటం వలన వినియోగదారులు విద్యుత్ వైర్లకు, కేబుల్ వైర్లకు తేడా తెలియక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం పోల్ రెంటల్ చార్జీలను వసూలు చేయాలన్నారు. వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన పంపుసెట్లకు విద్యుత్ ఇవ్వడానికి అంచనాలు వర్క్స్ ఆర్డర్లను త్వరగా మంజూరు చేసి 30-40 రోజుల వ్యవధిలో కొత్త వ్యవసాయ కనెక్షన్లను మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం ఈనెల 17నుంచి నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో గృహజ్యోతి లబ్ధి పొందని వినియోగ దారులు దరఖాస్తులను ఇవ్వడానికి అవగాహన కల్పించాలని తెలిపారు.


కరీంనగర్ సర్కిల్ అధికారుల సమావేశంలో ఎస్ఈ

● వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ సూచించారు. తడిసిన కరెంట్ స్తంభాలను ముట్టుకోరాదన్నారు. విద్యుత్ లైన్‌కు చెట్టు కొమ్మలు తగిలితే సంబంధిత అధికారికి తెలియజేయాలని అన్నారు. ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోరాదన్నారు. ఉతికిన బట్టలు ఇనుప తీగలపై ఆరవేయకూడదని సూచించారు.

టేకు చెట్ల నరికివేత


నరికివేసిన టేకు చెట్టు

వీర్నపల్లి: ఆగస్టు 31: మండలంలోని అల్మాస్‌పూర్ అటవీ సెక్షన్ పరిధిలోని కంచర్ల శివారులోని లచ్చుక్క గుడ్డంలో ఏపుగా పెరిగిన టేకు చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి అటవీ ప్రాంతంలోనే సైజులుగా మార్చి రహస్యంగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. రైతులు సొంత చేలలో చెట్లు నరికితే కేసులు పెడుతున్న అధికారులు అటవీ సంపదను నాశనం చేస్తున్న పట్టించుకోవడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్ల నరికివేతపై ఎఫ్ఎస్ఓ పద్మలతను వివరణ కోరగా ప్రతిరోజు అటవీ ప్రాంతంలో నిఘా పెడు తున్నామని, చెట్లను నరుకుతున్న వారిని పట్టుకొని కేసులు నమోదు చేస్తామన్నారు.


అటవీప్రాంతంలో నరికివేసిన టేకు చెట్లు

ఇద్దరు డీజే నిర్వాహకులపై కేసు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 31: ఎలాంటి అనుమతులు లేకుండా డీజేలు నడిపిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదుచేసి అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద, వెంకంపేట వద్ద రోడ్లపై డీజేలు పెట్టుకొని ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న డీజే యజమానులైన వి. పవన్‌కుమార్, గోలి రాజేందర్‌పై వేర్వేరుగా కేసు నమోదు చేశామన్నారు. రెండు డీజేలను సీజ్‌చేశామన్నారు. డీజే యజమానులను అరెస్ట్‌చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. జిల్లాలో డీజే యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చామని, అయినప్పటికీ పోలీసుల సూచనలు బేఖాతరు చేయడం వల్ల కఠినచర్యలు తీసుకుంటున్నామన్నారు. గణేశ్ మండపాల వద్ద పోలీసు అధికారుల అనుమతితో చిన్న స్పీకర్లు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి రోజు రాత్రి 10గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. డీజేల వలన చిన్నపిల్లలు, విద్యార్థుల చదువునకు , వృద్ధుల ఆరోగ్యానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని డయల్ 100కు కాల్స్ రావడంతో వెంటనే చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేసినా, యాంప్లిఫైయర్‌తో బాక్స్‌లు ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేశ్ మండపాల్లో, శోభాయాత్రలోనూ డీజేలు ఏర్పరిచి ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ఎవరైనా డీజేలు ఏర్పాటుచేస్తే యజమానులు, నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

గంభీరావుపేట, ఆగస్టు 31:మండలంలోని నర్మాల మానేరు క్యాంపు మైసమ్మ ఆలయం సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడిన దేవేందర్‌గౌడ్ అనే వ్యక్తి శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం సింగరాయపల్లి గ్రామానికి చెందిన దేవేందర్‌గౌడ్ గంభీరావుపేట మండలం శ్రీగాధలోని తన అత్తగారింటికి వెళ్లే క్రమంలో నర్మాల మానేరు ప్రాజెక్టు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. దీంతో దేవేందర్‌గౌడ్ ముఖం, కాళ్ల చేతులతో పాటు తలకు బలమైన గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దేవేందర్‌గౌడ్ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, రెండు నెలల పాప ఉన్నారు.

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

మల్యాల, ఆగస్టు 31: దిగువ కొండగట్టులో శనివారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. ఈ మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష ఇతర సిబ్బంది టిఫిన్ సెంటర్లు, హోటళ్లను పరిశీలించారు. కొన్ని హోటళ్లలో కుళ్లిన వస్తువులు, కాలం చెల్లిన తిండి పదార్థాలను గుర్తించి వాటిని పడేశారు. పరిశుభ్రతతో శుచి, శుభ్రతతో నాణ్యత గల వాటినే ప్రజలకు అందించాలని లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో తనిఖీల సమయంలోనూ పాడైన వస్తువులు లభించగా తీరు మారకపోవడంతో నిర్వహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటళ్లకు లైసెన్స్‌లు తీసుకోవాలని, లైసెన్స్‌లు ఉన్న వారు వారం రోజుల్లోగా రెన్యూవల్ చేసుకోవాలని లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జమ్మికుంటలో గంజాయి పట్టివేత

జమ్మికుంట, ఆగస్టు 31: జమ్మికుంట రైల్వేస్టేషన్ నుంచి బల్లార్షకు గంజాయి తరలించేందుకు ప్రయత్నిస్తున్న ఓ మహిళను ఎక్సైజ్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. జమ్మికుంట పట్టణానికి చెందిన యండి శమీమ్ అనే మహిళ బల్లార్షకు గంజాయి తరలించేందుకు రైల్వేస్టేషన్ చేరుకుంది. సమాచారం అందుకున్న అబ్కారీ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి సదరు మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద ఉన్న 490గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, తహశీల్దార్ ఎదుట హాజరు పరిచారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో అబ్కారీ సీఐ మాధవీలత, ఎస్సై సౌమ్య, కానిస్టేబుళ్లు అయిలయ్య, పెద్దన్న, భాస్కర్, మహేష్, పద్మావతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● బంగారు ఆభరణాల అపహరణ

శంకరపట్నం, ఆగస్టు 31: శంకర పట్నం మండలం మొలంగూర్ పరిధిలోని గుడాటిపల్లి గ్రామంలో ఇంటి తాళం పగల గొట్టి చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రం సంజీవరెడ్డి భార్యతో కలిసి ఈ నెల 30న సాయంత్రం తన కుమారుడి కొడుకు పుట్టిన రోజు ఫంక్షన్‌కు కరీంనగర్‌కు వెళ్లాడు. తిరిగి శనివారం ఇంటికి వచ్చి చూసే సరికి బీరువా తాళం పగలగొట్టి వస్తువులు చిందర వందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు క్లూస్ టీమ్‌తో అక్కడికి చేరుకొని వివరాలను నమోదు చేసుకొని వేలిముద్రలు సేకరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

పోలీసుల అదుపులో బెదిరింపులకు పాల్పడ్డ వ్యక్తి

కోరుట్ల, ఆగస్టు 31: పట్టణానికి చెందిన ఓ రియల్టర్‌ను ఫోన్‌లో డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిని కోరుట్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారం రోజుల నుంచి పట్టణంలో ప్రకాశం రోడ్డుకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారికి డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాలుపడుతున్న విషయంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి పథకం ప్రకారం పట్టుకున్నారు. మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి పట్టణంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారికి వారం రోజుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తూ ఓ వ్యక్తి ఫోన్ చేస్తూ బెదిరిస్తున్నాడు. మొదట రూ. 50లక్షలు కావాలని ఫోన్ చేసి బెదిరించాడు. దీంతో సదరు వ్యాపారి తనవద్ద అంత డబ్బులేదని ఫోన్ పెట్టేసాడు. మళ్లీ కొత్త నంబర్లతో ఫోన్ చేసి రూ. 5లక్షలైనా ఇవ్వాలని ఒత్తిడి చేశారు. దీంతో గంట తరువాత ఫోన్ చేయండి అని చెప్పి వ్యాపారి విషయాన్ని పోలీసులకు తెలిపాడు. రియల్టర్‌కు గంట తరువాత మళ్లీ ఫోన్ రావడంతో పోలీసుల సూచన మేరకు సదరు వ్యక్తిని రైల్వేస్టేషన్ వద్దకు రావాలని సూచించాడు. బెదిరింపులకు పాలుపడిన వ్యక్తి మరో వ్యక్తితో కలిసి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అప్పటికే అక్కడ మాటువేసిన పోలీసులు పథకం ప్రకారం ఆ వ్యక్తులను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. సదరు వ్యక్తి 6 నెలల క్రితం పోలీసుల వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా తన వాహనంలో పిస్తోల్‌తో దొరికాడు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కొన్ని రోజుల క్రితం జైల్ నుంచి వచ్చిన సదరు వ్యక్తి మరో కేసులో ఇరుక్కుని పోలీసులకు చిక్కడంతో చర్చనీయాంశంగా మారింది.

రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

● రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి ● ఎనుమాముల మార్కెట్‌లో అధికారులతో సమీక్ష

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 31: వ్యవసాయ మార్కెట్లలో రైతులకు మెరుగైన సేవలందించమే తమ ముందున్న లక్ష్యమని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి అన్నారు. శనివారం వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఏనుమాముల, జనగామ, జమ్మికుంట, మహబూబాబాద్, ఖమ్మం మార్కెట్ కమిటీల కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులు ఏనుమాముల మార్కెట్‌లోని పలు సమస్యలను మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. మార్కెటింగ్ శాఖలో ముఖ్యంగా మార్కెట్లలో సిబ్బంది కొరత ఉన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఉన్న అధికారులు, సిబ్బందితో ప్రస్తుతం ఉన్న సాంకేతికతను జోడించి మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఏనుమాముల మార్కెట్‌లో ఉన్న వేబ్రిడ్జిలను మరమ్మతు చేయించి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. లక్ష్మీపురం, మార్కెట్‌తో పాటు ఏనుమాముల మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. మార్కెట్‌లో దడువాయిలు వాడే పీవోఎస్ మిషన్లు కొత్తవి కొనుగోలు చేస్తున్నామని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. మార్కెట్‌లో ఎలాంటి సమస్యలున్నా వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఒక్కో మార్కెట్ స్థితిగతులు, అక్కడి సమస్యలు, మార్కెట్ ఫీజువసూళ్లు, అలాగే అభివృద్ధి పనులపై సంబంధిత కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. సీజన్ ప్రారంభం కాకముందే అభివృద్ధి పనులను పూర్తి చేయించాలని సూచించారు. మార్కెట్ ఫీజు పెండింగ్ లేకుండా వసూలు చేయాలని, ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో కె.సురేఖ, ఏనుమాముల మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, గ్రేడ్- 2 కార్యదర్శులు అజిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

మార్కెట్ కమిటీ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వహించవద్దని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి మార్కెట్ కమిటీ కార్యదర్శులకు సూచించారు. శనివారం ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో వరంగల్, జనగామ, జమ్మికుంట, ఖమ్మం, మహబూబాబాద్ మార్కెట్ కమిటీల కార్యదర్శులతో మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్‌లతో కలిసి లక్ష్మీబాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కో మార్కెట్ కమిటీ స్థితిగతులు, అక్కడి సమస్యలు, మార్కెట్ ఫీజు వసూళ్లు, అలాగే అభివృద్ధి పనులపై సంబంధిత కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. సీజన్ ప్రారంభం కాకముందే అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు. మార్కెట్ ఫీజు పెండింగ్ లేకుండా వసూలు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో కె.సురేఖ, ఎనుమాముల మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, జన్ను భాస్కర్, లాషరీఫ్, పి.అశోక్, జీవన్ పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

గణేశ్‌నగర్, ఆగస్టు 31: స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గీతాభవన్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. బీసీ సమగ్ర కులగణన చేపట్టి రాజ్యాధికారంలో బీసీల వాటా తేల్చాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీల కులగణన కోసం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడానికి స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కుల గణన ప్రారంభించే వరకు ప్రభుత్వంపై తమ పోరాటం ఆగదన్నారు. బీసీలకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వాలను ప్రశ్నిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నారాజు రాకేష్‌చారి, బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాస సంజీవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రంగు సంపత్ గౌడ్, ఎడ్ల సురేందర్, బ్రహ్మాచారి, నలవెలి రవి, బండారి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భార్య చికెన్ వండలేదని ఆత్మహత్య


కిశోర్(ఫైల్)

సుల్తానాబాద్, ఆగస్టు 31: చికెన్ తీసుకుని ఇంటికి వచ్చిన భర్త వండమని భార్యకు చెప్పాడు. ఇంటి పనిలో బిజీగా ఉన్న భార్య కాసేపు ఆగిన తర్వాత వండుతానని చెప్పింది. దీంతో మనస్తాపం చెందిన భర్త ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... సుల్తానాబాద్ మున్సిపల్ విలీన గ్రామమైన పూసాల గ్రామానికి చెందిన పూసాల కిశోర్(33) కార్పెంటర్. తాగుడుకు బానిసై పనిలేకుండా తిరుగుతూ అప్పుడప్పుడు కూలీ పనికి వెళ్లి వచ్చిన డబ్బును తాగుడుకే ఖర్చు చేస్తున్నాడు. దాంతో ఇంట్లో పూట గడవక భార్య సుల్తానాబాద్ పట్టణంలోని ఓ కిరాణా షాపులో పనిచేస్తోంది. ఆ వచ్చే డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తోంది. శనివారం రాత్రి ఇంటికి చికెన్‌తో వచ్చిన కిశోర్ తన భార్యను కూర వండమని చెప్పాడు. కొంత సేపాగి వండుతానని భార్య చెప్పడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 31: తనకు రావాల్సిన వాటా భూమి విషయంలో సోదరుడితో వివాదం విషయంలో మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన కొప్పుల చంద్రకాంద్(45) చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. వల్లంపహాడ్‌కు చెందిన కొప్పుల చంద్రకాంత్ భూమి విషయంలో సోదరుడితో గొడవపడి ఈ నెల 24న వెంకటేశ్వర ఆలయం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అధిక వడ్డీ వసూలు చేస్తున్న వ్యక్తికి జరిమానా

ఇల్లంతకుంట, ఆగస్టు 31: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన మొల్లంకుల బాలయ్య ఇతరులకు అప్పులు ఇచ్చి అధిక వడ్డీ వసూలు చేస్తున్నాడని శనివారం కలెక్టర్ రెండు లక్షల రూపాయల జరిమానా విధించినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకున్న బాలయ్య అధికంగా వడ్డీ వసూలు చేస్తున్నాడనే ఫిర్యాదు మేరకు ఏప్రిల్ నెలలో దాడి చేశామని తెలిపారు. బాలయ్య వద్ద ప్రామిసరీ నోట్స్, చెక్కులు, డాక్యుమెంట్లు లభించగా కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఎదుట హాజరుపర్చగా రెండు లక్షల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగ పట్టివేత

కరీంనగర్ క్రైం/భగత్‌నగర్, ఆగస్టు 31: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక ప్రయాణికుడి సెల్‌ఫోన్‌ను దొంగలిస్తుండగా సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బస్టాండ్‌లోని 14వ ప్లాట్‌ఫాం వద్ద జి.శ్రీనివాస్ అనే ప్రయాణికుడు బస్‌లోకి ఎక్కుతుండగా శనివారం చెన్నూర్‌కు చెందిన ఎం.సతీష్ అనే వ్యక్తి సెల్‌ఫోన్ చోరీకి యత్నించాడు. విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ ఎం.లక్‌పతి, కానిస్టేబుల్ రమణ, కొమురయ్య, కవితలు పట్టుకున్నారు. అనంతరం సతీష్‌ను, సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ● మిడ్ మానేరు నిర్వాసితులతో సమావేశం

వేములవాడ టౌన్, ఆగస్టు 31: మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితల సమస్యల పరిష్కారా నికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. వేములవాడ మండలం చీర్లవంచ గ్రామంలో ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, కొడుముంజ, అనుపురం, శభాష్‌పల్లి, చింతలఠాణ, గుర్రంవానిపల్లి గ్రామాలకు చెందిన నిర్వాసితులతో శనివారం సహావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమా నికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల వారీగా సమస్యల ను అడిగి తెలుసుకున్నారు. తమ ఇళ్లకు పరిహారం, పట్టాలు, 18 ఏళ్లు నిండిన వారికి పరిహా రం, ఆల యాలకు పరిహారం రాలేదని ఇతర సమస్యలను ప్రభుత్వ విప్, కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తమ గ్రామాలకు సరిహద్దులు చూపాలని, ఆక్రమణలు నిరోధించాలని, శ్మశాన వాటికల వద్ద సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముంపు గ్రామాల పరిధి లో వెలిసిన రియల్ ఎస్టేట్ వెంచర్లకు అనుమతులు ఉన్నాయా? డీటీసీపీ అనుమతి ఉందా లేదా తెలుసుకోవాలని, ప్రభుత్వ భూము లపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశిం చా రు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మానవతా దృక్ప థంతో అందరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి పరిహారం వచ్చేలా కృషి చేస్తాన ని స్పష్టం చేశారు. నోటిఫైడ్ కానీ వారి దరఖాస్తులపై మరోసారి అధికారులతో సర్వే చేయి స్తామని, అర్హులైన ప్రతీఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్, ఎస్డీసీ రాధాబాయ్, డీఆర్డీవో శేషాద్రి, తహసీల్దార్ మహేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఎరువుల అమ్మకాల్లో నిధుల దుర్వినియోగం

● ముగ్గురు అధికారుల అరెస్టు

వేములవాడ రూరల్, ఆగస్టు 31: మార్క్‌ఫెడ్‌లో ఎరువుల అమ్మకాల్లో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ముగ్గురు నిందుతులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం సీఐ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మార్క్‌ఫెడ్‌లో ఎరువుల అమ్మకాలకు సంబంధించి బకాయిల అవకతవకలున్నట్లు గమనించిన యాజమాన్యం చీఫ్ అకౌంట్స్ అధికారికి విచారణ చేయమని జూలై నెలలో ఆదేశాలిచ్చింది. విచారణ చేపట్టిన అధికారి సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. వేములవాడ డీసీఎంఎస్‌కు సంబంధించి 2022 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 76,77,325 రూపాయల అవకతకవకలు జరిగినట్లు గుర్తించారు. జిల్లా మార్క్‌ఫెడ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పి రమేష్ తన భార్య పేరుతో ఎరువుల షాప్ కోసం లైసెన్స్ తీసుకున్నాడు. మార్క్‌ఫెడ్‌కు అడ్వాన్స్ చెల్లించి ఎరువులను తీసుకోవాల్సి ఉండగా అకౌంటెంట్ భాస్కర్ సాయంతో నగదు చెల్లించినట్లు నకిలీ పత్రాలు సృష్టించారు. నకిలీ పత్రాలతో జిల్లా మేనేజర్ దివ్యభారతికి బకాయిలు లేనట్లుగా చూపించి ఎరువులను పొంది బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుని 76,77,325 రూపాయలు సొంతానికి వాడుకున్నారు. విచారణ అనంతరం మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు జిల్లా మార్క్‌ఫెడ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పి రమేష్‌ను,అకౌంటెంట్ భాస్కర్‌ను విధుల నుంచి తొలగించారు. అనంతరం రమేష్, భాస్కర్‌తో పాటు విధుల్లో బాధ్యతారహితంగా వ్యవహరించిన జిల్లా మేనేజర్ దివ్యభారతిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మార్క్‌ఫెడ్ యాజమాన్యం ఫిర్యాదు చేసింది. దీంతో శనివారం జిల్లా మార్క్‌ఫెడ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రమేష్, అకౌంటెంట్ భాస్కర్, జిల్లా మేనేజర్ దివ్యభారతిలను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

6న ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 31: ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 6న ఉమ్మడి జిల్లా బాలుర సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలను నిర్వహించనున్నారు. రామడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉదయం 9గంటల నుంచి హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను వరంగల్ జిల్లా హన్మకొండలో 14, 15 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వం, క్రమశిక్షణ అలవడుతాయన్నారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. అసోసియేషన్ ద్వారా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహిక క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, పుట్టినతేదీ సర్టిఫికె ట్‌ను వెంట తీసుకొని సంఘ సంయుక్త కార్యదర్శి ఎన్. ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్‌లకు రిపోర్టు చేయాలని తెలిపారు. వివరాలకు ఫోన్. 9441925807 నంబర్‌లో సంప్రదించాలని వారు సూచించారు.

దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉంది

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 31: భారత దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు అప్పన్నగారి వెంకట్రావ్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో సెప్టెంబరు 3, 4 తేదీలో జరిగే మోగా ఇంపాక్ట్ ప్రోగ్రాం వాల్‌పోస్టర్‌ను ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రావ్ మాట్లాడుతూ ప్రస్తుతం యువతకు జీవితం, సమాజంపై అవగాహన లేకపోవడంతోనే దారుణాలు జరుగుతున్నాయని అన్నారు. వీటిపై అవగాహణ కల్పించడానికి కరీంనగర్‌లో ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మెగా ఇంపాక్ట్ ప్రోగ్రాంను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రోగ్రాంపై ఎలాంటి సందేహాలు ఉన్నా సెల్ : 9676004408 నెంబర్‌కు ఫోన్ చేసి తీర్చుకోవచ్చునని అన్నారు. సమావేశంలో ఉత్తర తెలంగాణ రీజినల్ డైరెక్టర్ కుతాడి తిరుపతి, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి సిరిసిల్ల బాలకృష్ణ, అధ్యక్షుడు కోడం బాలకిషన్ ఉన్నారు.


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు

పాపన్న గుట్టలను పరిశీలించిన అధికారులు


సర్వాయి పాపన్న గుట్టల వద్ద అధికారులు

సైదాపూర్, ఆగస్టు 31: సైదాపూర్ మండలంలోని సర్వాయిపేట శివారులో ఉన్న సర్వాయి పాపన్న గుట్టలు, ఆ ప్రాంతాన్ని టూరిస్టు స్పాట్‌గా ఏర్పాటు చేయుటకు టూరిజం అధికారులు డీఈ విద్యాసాగర్, జేఈ జీవన్‌రెడ్డి హుజూరాబాద్ డీఐ పాయబ్ అలీ, సైదాపూర్ తహసీల్దార్ దూలం మంజూలలు పర్యటించి పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల సర్వాయి పాపన్న గుట్టలను పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దేందుకు నిధులు విడుదల చేయడంతో ముందుగా ఆ నిధులతో ఏఏ పనులు చేపట్టాలో పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ శరత్, సర్వాయర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఏటీఎం చోరీకి యత్నం

కొడిమ్యాల, ఆగస్టు 31 : కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారికి సమీపంలో మండలంలోని పూడూర్‌లో ఎస్‌బీఐ ఏటీఎం వద్ద గుర్తు తెలియని వ్యక్తి శనివారం తెల్లవారుజామున సుమారు రెండున్నర గంటల ప్రాంతంలో ఏటీఎంను పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నం చేసినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. సంఘటన స్థలాన్ని మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్ పరిశీలించారు. పోలీసులు క్లూస్ టీంతో తనిఖీలు చేశారు.

లారీ కింద పడి యువకుడి మృతి

చొప్పదండి, ఆగస్టు 31: మండలంలోని చాకుంట గ్రామానికి చెందిన దాసరి సంజీవ్ (28) లారి కింద పడి మృతి చెందాడు. ఎస్ఐ అనూష కథనం మేరకు సంజీవ్ తన బైక్‌పై వెళ్తుండగా బైక్ పాడైపోవడంతో చొప్పదండి శివారులోని పెట్రోల్ పంపు దగ్గర ఆగాడు. వర్షం పడుతుండడంతో అక్కడ ఆగి ఉన్న లారీ వెనుకాల కూర్చున్నాడు. లారీని డ్రైవర్ స్టార్ట్ చేయగా సంజీవ్ కాలుపై నుంచి టైరువెళ్లడంతో కుడికాలు విరిగిపోయింది. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సంజీవ్ మృతి చెందాడు.

రోగ నిర్ధారణ పరీక్షల సంఖ్య పెంచాలి

- పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



ఆసుపత్రిలో రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్

తంగళ్లపల్లి, ఆగస్టు 31: వర్షాకాలం నేపథ్యంలో దవాఖానల్లో రోగ నిర్ధారణ పరీక్షల సంఖ్య పెంచాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ సేవలు, ఫార్మసీ, వ్యాక్సిన్ గది, ఆసుపత్రి ఆవరణను పరిశీలించారు. ఫిజియోథెరపీ సేవల రిజిస్టర్ తనిఖీ చేశారు. అలాగే ఓపీపై ఆరా తీశారు. ఈ సందర్భంగా దవాఖాన ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో రక్త పరీక్షలు అధిక సంఖ్యలో చేయాలని సూచించారు. సీసీ టీవీలు మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నేహ, హోమియో డాక్టర్ డాక్టర్ దీప్తి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

బూత్‌ల వారీగా సభ్యత్వ నమోదు చేయించాలి

- సిరిసిల్ల నియోజకవర్గ బీజేపీ సభ్యత్వ ఇన్‌చార్జి వాసాల రమేష్

సిరిసిల్ల రూరల్, అగస్టు 31: పోలింగ్ బూత్‌ల వారిగా భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి అశించిన మేరకు సభుత్వాన్ని చేయించాలని సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి వాసాల రమేష్ కోరారు. సిరిసిల్ల పట్టణంలో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, సభ్యత్వ నమోదు పట్టణ ఇన్‌చార్జి అన్నల్‌దాస్ వేణు అధ్వర్యంలో సమావేశం జరిగింఇ. ఈ సందర్భంగా వాసాల రమేష్ మాట్లాడుతూ సెప్టెంబరు 2 వతేదీనుంచి అక్టోబరు చివరివరకు బీజేపీ సభ్యత్వ నమోదును శక్తి కేంద్రాల ఇన్‌చార్జిల అధ్వర్యంలో పోలింగ్ బూత్‌ల వారీగా నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి నాయకులు చేపట్టాలని సూచించారు. గతంలో కంటే ఈ సారీ పార్టీ సభ్యత్వాలను పెంచాలని కోరారు. అలాగే బీజేపీ చేపట్టిన సంక్షేమ పథకాలతోపాటు చేసిన అభివృద్ధిని ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించడంతోపాటు పార్టీ సభ్యత్వాలను చేయించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపీ, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మీ, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు పండుగ మాధవి, బీజేపీ కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు సుంకరి బాలకిషన్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు వంగ అనిల్‌కుమార్‌గౌడ్, బర్కం నవీన్‌యాదవ్, సంగీతం సాయిరాం, చొప్పదండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదులో ప్రతి కార్యకర్త ప్రజలను భాగస్వామ్యులను చేయాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మీ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వెంకటలక్ష్మీతో పాటు ఆ పార్టీ నాయకుడు శ్రీనివాస్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కోసం 8800002024 నంబర్‌కు మిస్డ్ కాల్ చేయించి నమోదు చేసేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, లక్ష్మారెడ్డి, సాయిలు, నరేశ్, కృష్ణహరి, రామచంద్రారెడ్డి, రవినాయక్, కిరణ్‌నాయక్, రాజు, రాజిరెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

రాచర్లబొప్పాపూర్‌లో పారిశుధ్య పనులు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



బోరు చుట్టూ శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 31: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో అధికారులు పారిశుధ్య పనులను శనివారం చేయించారు. రాచర్లబొప్పాపూర్‌లోని 11, 12 వ వార్డులో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారి కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులపై గత నెల 31న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ' అనే కథనానికి ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి గణేశ్ స్పందించారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిశీలించారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను తీర్చేందుకు చర్యలు చేపట్టారు. పారిశుధ్య కార్మికులతో మురుగు నీటి కాల్వలు, బోరు బావి చుట్టు పేరుకుపోయిన నాచును తొలగించారు. పారిశుధ్య చర్యలు చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి గణేశ్ సూచించారు. వార్డుల్లోని పారిశుధ్య పనులు చేపట్టడడం వల్ల కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

దేశవ్యాప్త ఆందోళనలను విజయవంతం చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 31: పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని సీపీఐ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న దేశవ్యాప్త ఆందోళనలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది సంవత్సరాల కాలంలో నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజీల్, వంట గ్యాస్ ధరలు మూడింతలు పెరగాయని మండిపడ్డారు. పెరిగిన ధరలను నియంత్రించాలని, జనగణను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ దేశ వ్యాప్తంగా ఆందోళనలన చేపట్టాలని పిలుపునిచ్చిందన్నారు. సెప్టెంబర్ 3న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సోమ నాగరాజు పాల్గొన్నారు.

ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 31: భారీ వర్షాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. 24 గంటల్లో జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున శనివారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 24 గంటలు డిఆర్‌ఎఫ్ బృందం అందుబాటులో ఉంటుందన్నారు. విపత్కర సమయాల్లో డయల్ 100కు కాల్‌చేస్తే వెంటనే సహాయక చర్యలు చేపడుతామన్నారు. ఎగువ మానేరు, మధ్యమానేరు పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎగువ మానేరును చూసేందుకు ఎవరికి అనుమతి లేదన్నారు. ఉధృతంగా ప్రవహించే వాగులు, కాలువల, నదుల వద్దకు ఎవరూ వెళ్లవద్దన్నారు. జలాశయాలు, చెరువులు, వాగులు, ప్రాజెక్టుల వద్దకు మృత్యకారులు, ప్రజలు ఎవరూ చేపల వేటకు వెళ్లొద్దన్నారు. కల్వర్టులు, బ్రిడ్జిల వద్ద నీరు ప్రవహిస్తే వాహనాలతో దాటేందుకు సాహసం చేయవద్దని ఆయన తెలిపారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- పోలీస్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుంటే మండపాలకు అనుమతి

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 31: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు భద్రత, పటిష్టమైన బందోబస్తు కోసం మండపాల నిర్వాహకులు రాష్ట్ర పోలీస్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో గణేశ్ మండపాల నిర్వహణకు పోలీసుశాఖ రూపొందించిన పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొని పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు. దీంతో మండపాల వద్ద పోలీసులు భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయడానికి సులువుగా ఉంటుందన్నారు. పోలీస్‌శాఖ ఆన్‌లైన్ ద్వారానే అనుమతి మంజూరు చేస్తామన్నారు. ఆ తర్వాతనే వినాయక మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గణేశ్ మండపాల నిర్వహణ బాధ్యత నిర్వాహకులదేనని, ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలన్నారు. మండపాల్లో ఏమైనా అనుమానస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

● మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదు: డీఎస్పీ

గంభీరావుపేట: వినాయక మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని, మండపాల పూర్తి బాధ్యత నిర్వాహకులదేనని డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. గంభీరావుపేట మండల కేంద్రంలో శనివారం గణేష్ నవరాత్రుల ఉత్సవాల భాగంగా రెడ్డి సంక్షేమ సంఘంలో విశ్వహిందూ పరిషత్, గణేష్ మండపాల నిర్వాహకులతో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా మండపాల వద్ద డీజేలకు అనమతి లేదని, శాంతియుత వాతావరణంలో వినాయక నవరాత్రి వేడుకలు జరుపుకోవాలన్నారు. అనుమతి లేకుండా మండపాల్లో కానీ నిమజ్జనం రోజున కానీ డీజేలను ఉపయోగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్‌ఐ బి రామ్మోహన్, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

● నిర్వాహకులు సహకరించాలి..



నాయకులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ ఎల్లాగౌడ్

వీర్నపల్లి: గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగేలా ప్రజలందరూ సహకరించాలని ఎస్‌ఐ ఎల్లాగౌడ్ కోరారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో పలువురు నాయకులతో శనివారం ఆయన మాట్లాడారు. వినాయక నిమజ్జనానికి ప్రతి ఒక్కరూ అనుమతి తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగే సౌండ్ సిస్టంకు అనుమతి లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 31: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ మదన్‌మోహన్ సూచించారు. మండలంలోని పొత్తూరు గ్రామంలోని రైతువేదికలో శనివారం రైతులకు చీడపీడల నివారణపై అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సందేహాలు ఉంటే వ్యవసాయశాఖ సూచనలు పాటించాలన్నారు. కాండం తొలుచు పురుగు, ఎండాకు తెగులు నివారణలకు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్ర కరీంనగర్ శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్, ఏఈవో లలిత, రైతులు పాల్గొన్నారు.

గీతా పారాయణ

తంగళ్లపల్లి, ఆగస్టు 31: మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో గీతా ప్రచార సేవా సమితి ఆధ్వర్యంలో గీతా పారాయణం నిర్వహించారు. అనంతరం ఫ్రెండ్స్ క్లబ్ తంగళ్లపల్లి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గీతా ప్రచార సమితి అధ్యక్ష, కార్యదర్శులు కోడం నారాయణ, జనపాల శంకరయ్య, సభ్యులు పాల్గొన్నారు.

నియామకం

తంగళ్లపల్లి, ఆగస్టు 31: తెలంగాణ రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా మండలంలోని జిల్లెల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మాట్ల మధును నియమించారు. మాట్ల మధుకు రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్యగౌడ్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్ల మధు మాట్లాడుతూ మాజీ సంర్పంచుల సమస్యలను

ఏఎస్‌ఐని సన్మానించిన ఎస్పీ

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 31: పదవీ విరమణ పొందిన ఏఎస్‌ఐ చీటి సంజీవరావును జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేషజీవితాన్ని కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కుటుంబసభ్యుల ప్రోత్సాహం తోనే 35ఏళ్ల విధులు సక్రమంగా నిర్వహించి ఉన్నత స్థానాలకు ఎదగగలరన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్‌ఐ యాదగిరి, ఎస్‌ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

వీర్నపల్లి, ఆగస్టు 31: వర్షాకాలంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఏఎన్‌ఎంలు మంజుల, ఇందిర అన్నారు. వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామంలో డ్రై డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరుగుతూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో చెత్తను లేకుండా చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురికి కాలువల వెంబడి క్లోరినేషన్, దోమల నివారణ స్ప్రే చేయించారు. ఆశావర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 31: హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్న ఇచ్చిన మాట ప్రకారం లబ్ధిదారుల ఫించన్ పెంచలేకపోయిందన్నారు. కార్మిక క్షేత్రమైన సిరిసిల్లలో కార్మికులు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం రెండు మాసాలుగా ఆసరా ఫించన్లు అందించడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 4వేల రూపాయలకు పింఛన్ పెంచుతామని హామీ ఇచ్చారని ఇంతవరకు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆసరా ఫించన్లు రాక దివ్యాంగులు, వితంతులు ఇబ్బంది పడుతున్నారని వారి ఖాతాలో వెంటనే రెండు నెలల ఫించన్లు వేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఫించన్ రాని లబ్ధిదారులను కలుపుకొని సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి, ఆగస్టు 31: మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుండి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 6,300 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. దిగువకు ఎల్ఎండీ ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా మూడు వేల క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3,200 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 312.19 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 14.92 టీఎంసీల మేరకు ఉంది.

డీసీఎస్‌వో, డీఎంలకు బదిలీ వీడ్కోలు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 31: జగిత్యాల జిల్లాకు బదిలీపై వెల్తున్న జిల్లా పౌర సరఫరాల అధికారి(డీసీఎస్‌వో) జితేందర్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్(డీఎం) జితేంద్రప్రసాద్‌కు శుక్రవారం రాత్రి సిరిసిల్ల పట్టణంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ బదిలీ వీడ్కోలు సన్మాన సమావేశం నిర్వహించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్రప్రసాద్‌ను పూలమాలలు, పుష్పగుచ్చాలు, శాలువాలతో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో వేములవాడ, సిరిసిల్ల డీటీసీఎస్ లు నవీన్‌కుమార్, రవీంద్రాచారి, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు రెడ్డిమల్ల హన్మాండ్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి వీ సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ ప్రతినిధి వీ కళాఆనం దం, ఉపాధ్యక్షుడు పీ శ్రీనివాస్, జిల్లా ప్రచార కార్యదర్శి బీ వరలక్ష్మి, వేములవాడ డివిజన్ అధ్యక్షుడు ఎం మహేష్, సిరిసిల్ల డివిజన్ ప్రధాన కార్యదర్శి జీ శ్రీనివాస్, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంభీరావుపేటలో ప్రబలుతున్న జ్వరాలు



జ్వరాలతో చికిత్స పొందుతున్న బాధితులు

గంభీరావుపేట, ఆగస్టు 31: మండల కేంద్రంతో పాటు నర్మాల, లక్ష్మీపూర్ తండాల్లో వారం పది రోజుల నుంచి జ్వరాలు ప్రబలుతున్నాయి. వర్షాకాలం కావడంతో పారిశుధ్య సమస్యకుతోడు దోమలు వృద్ధి చెందడంతో జ్వరాలు ప్రబలుతున్నాయి. మండల కేంద్రం, నర్మాల, లక్ష్మీపూర్ గ్రామాల్లో జ్వర పీడితులు రోజురోజుకు పెరుగుతున్నారు. గంభీరావుపేట ప్రభుత్వాసుపత్రిలో రోజుకు 170 నుంచి 200 వరకు ఓపీ కేసులు నమోదవుతున్నాయి. మండల పరిధిలో మూడు డెంగ్యూ కేసులు కూడా నమోదు కావడంతో అధికారులు, వైద్యులు అప్రమత్తమయ్యారు. తగ్గని జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులతో ప్రజలు మంచం పడుతున్నారు. జ్వరాలు పెరుగుతున్న క్రమంలో గ్రామాల వారీగా వైద్య సిబ్బంది ఇంటింటా రక్త పరీక్షలు నిర్వహించి ముందస్తు వైద్య సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

● పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

గంభీరావుపేట: వర్షాకాలం కావడంతో వాతావరణ మార్పుల వలన టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూలతో పాటు విషజ్వరాలు ప్రబలుతున్నాయని, ప్రజలు పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిలువ లేకుండా చూసుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెండెంట్ సృజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏడీస్ ఈజిప్టు అనే ఈ దోమ వల్ల డెంగ్యూ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. ఈ దోమ ఉదయం సాయంత్రం ఎక్కువగా కుడుతుందని ఈ సమయాలలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టైఫాయిడ్ మలేరియా డెంగ్యూ వచ్చిన వారికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిల్వలేకుండా ఉంచుకోవాలన్నారు. కాచి వడబోషిన నీటిని తాగాలని, ఆహారం వేడిగా ఉన్నప్పుడే భోజనం చేయాలని సూచించారు. జలుబు, దగ్గు జ్వరం ఉన్నవారు చిన్న పిల్లలకు దూరంగా ఉండాలని సూచించారు. వైద్యుల సలహాతోనే మందులను వాడాలని పేర్కొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళలు నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

గంభీరావుపేట, ఆగస్టు 31: మండలంలోని నర్మాల గ్రామంలో తాగునీటి కటకటతో ప్రజల అవస్థలు పడుతున్నారు. దాదాపు నెల రోజుల నుంచి నీటి సరావరా తగినంతగా రావడం లేదని మహిళలు ఖాళీ బిందెలతో శనివారం నిరసన తెలిపారు. బోరు మోటర్లు కాలిపోయి నీటి సమస్య తలెత్తిందని సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. మిషన్ భగీరథ నీరు రంగుమారి రావడంతో చర్మ వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో మంచినీటి బావిలో నీళ్ల సరిపడా ఉన్న గ్రామపంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు మండిపడుతున్నారు. ముఖ్యంగా, శివారు వార్డుల్లో తాగునీరు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో నీటి సమస్యను తీర్చాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల రూరల్, అగస్టు 31: సిరిసిల్ల మున్సిపల్‌పరిధిలోని 9వవార్డులోని బాబాజీ కాలనీకి చెందిన బొమ్మేశ కృష్ణవేణికి ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి 34వేల రూపాయలు మంజూరు కావడంతో చెక్కును శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారు ఇంటికి వెళ్లి అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ మంగ కిరణ్‌కుమార్, బుడుగు భరత్, పట్టణ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సలేంద్రి వేణుగోపాల్‌యాదవ్, పల్లపు శ్రీనివాస్, రెడ్డిమల్ల దేవేందర్, ఉపేందర్, శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన ఎన్ రవళికి 11 వేల రూపాయలు, సత్యవ్వకు 14 వేలరూపాయల విలువ గల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వంగ ఆరునిత్‌రెడ్డి, నాయకులు గున్నాల బాలగౌడ్, గుమ్మల రాజయ్య, కుంట రాజయ్య, కుంట రాజమల్లయ్య, యాడారపు పోచయ్య, యాడారపు మల్లయ్య, చెల్లాపూర్ ముత్తయ్య, నక్క రాజయ్య, కుంట వినోద్ తదీతరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అక్కపల్లి, రాజన్నపేట, బండలింగంపల్లి, అల్మాస్‌పూర్ గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం పంపిణీ చేశారు. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, బాబు, అంజనేయులు, రాములు, నరేందర్, శంకర్, భూమారెడ్డి, దేవేందర్‌యాదవ్, లచ్చిరెడ్డి, మోహన్, శ్రీనివాస్, దేవయ్య, బాల్‌రెడ్డి, రాజయ్య, బాలయ్య, సురేశ్, పవన్‌రెడ్డి, చంద్రారెడ్డి, కిష్టారెడ్డి, మల్లారెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటారు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 31: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన బోరు మోటారును మాజీ సర్పంచ్ నర్సయ్య శనివారం ప్రారంభించారు. రూ.2లక్షల ప్రత్యేక నిధులను కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మంజూరు చేయించారని పేర్కొన్నారు. కాలనీవాసులతో పాటు ఆలయానికి వచ్చే భక్తులకు నీటి వసతి తీరనుందని అన్నారు. కార్యక్రమంలో తాజా, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, తాజా, మాజీ ఎంపీటీసీ అపెరాసుల్తానా, నాయకులు లక్ష్మారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మల్లారెడ్డి, హన్మండ్లు, మహేందర్, సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి, బాబు, బాల్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 31: విద్యార్థులకు హాస్టళ్లలో నాణ్యమైన ఆహారాన్ని అందించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా వారికి చీమకుట్టినట్లుగా కూడా లేదన్నారు. రంగారెడ్డి జిల్లా పాలమాకుల కస్తూరీబా గాంధీ హాస్టల్లో పురుగుల అన్నం పెడుతున్నారని విద్యార్థులు ప్రశ్నిస్తే ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థుల కళ్లలో కారం కొట్టడం దుర్మార్గం అన్నారు. ఉపాధ్యాయులను, సిబ్బందిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. పాఠశాల గదుల్లో చదువుకోల్సిన విద్యార్థులు సమస్యలపైన రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆరోపించారు. ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని, సరియైన విద్య అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇలాంటి సంఘటన పునారావృతం కాకుండా ప్రభుత్వం కమిటి వేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్వీ నాయకులు మట్టి శ్రీనివాస్, కోడం వెంకటేష్, వావిలాల సాయి, శ్రీనివాస్, కరుణాకర్, అరవింద్, నరేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శనివారం పూజలు

వీర్నపల్లి, ఆగస్టు 31: వీర్నపల్లి మండలంలోని రాశిగుట్టపై వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎత్తయిన గుట్టపై ఉన్న ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఏఈవోకు సన్మానం

కోనరావుపేట, ఆగస్టు 31: కోనరావుపేట మండలం సుద్దాలలో ఏఈఓగా పనిచేసిన నరేష్ కుమార్ బదిలీపై వెళ్తుండగా అయనను రైతు వేదికలో రైతులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామాల్లో ఏఈవోగా నరేష్ కుమార్ చేసిన సేవలు చిరస్మరణీయంగా ఉంటాయని రైతులు కొనియాడారు. కార్యక్రమంలో రైతులు సుంకరి, బాదినేని బాల్‌రాజు, నీరటి సంజీవ్, కాదాసు సుధాకర్, బాదినేని దేవయ్య, సుంకరిరెడ్డి, లక్ష్మణ్, నీరటి రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ

గంభీరావుపేట, ఆగస్టు 31: మండల కేంద్రంలోని బరిగెల గూడెం కాలనీలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట నూతన కమిటీ శనివారం ఎన్నికైంది. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట జిల్లా ప్రతినిధుల సమక్షంలో గంభీరావుపేట గ్రామం బరిగేలగూడెం కాలనీ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా భోగన్న గారి రాజనర్సయ్య, కో కన్వీనర్లుగా గాదం ఆదిత్య, ఏగదండి రామస్వామిలను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా పిట్ల శ్రీధర్, పెండ్యాల బాలయ్య, గన్నె నాగరాజు, బరిగెల ప్రవీణ్, ఎగదండి శ్రావణ్, మేడిపల్లి సంతోష్, ఎగదండి అరుణ్, బండ రాజు, ఎగదండి అర్జున్, ఆశంగారి మధు, చీకోటి నరేందర్, బండ సతీష్, ఏగదండి వినోద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రతినిధులు బార ధనరాజ్, మల్యాల రాజీవ్, ఎగదండి స్వామి, ఎడబోయిన రాజు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



కౌన్సిలర్లకు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 31: సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్యం విభాగంలో విధులను నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల ను పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూని యన్ ఆధ్వర్యంలో మున్సిపల్ సమావేశానికి హాజరైన మున్సిపల్ కమిషనర్, పాలకవర్గ సభ్యులకు శనివారం వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, యూనియన్ అధ్యక్షుడు సుల్తాన్ నర్సయ్య మాట్లాడారు. కార్మికులకు ఐదు నెలల పీఆర్‌సీ ఏరియల్స్ బకాయిలను ఇవ్వాలని, 2009 నుంచి 2012 వరకు 118 మంది కార్మికులకు సంబంధించిన పీఎఫ్, విలీన గ్రామాలకు సంబంధించిన కార్మికుల పీఎఫ్‌ల డబ్బులను వారి వ్యక్తిగత ఖాతాలలో జయచేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు రావల్సిన ఈఎస్‌ఐ, ఐడెంటీ కార్డులని ఇవ్వాలన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన బట్టలు, సబ్బులు, నూనె, చెప్పులు, ఇతర రక్షణ సామగ్రిని వెంటనే అందించాలన్నారు. రానున్న వినాయక నిమజ్జనం పనులను మున్సిపల్ కార్మికులతో కాకుండా ఇతరులతో చేయించుకోవాలన్నారు. పోస్టాఫీస్ ద్వారా చేయించిన మున్సిపల్ కార్మికుల భీమా గడువు ముగిసిందని వెంటనే రెన్యూవల్ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కాసర్ల శంకర్, కోశాధికారులు నర్మెట ఉమ, మారుపాక లక్ష్మి, కార్యవర్గ సభ్యులు నరేష్, బాలయ్య, భారతవ్వ, రమ, శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.